బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-పాతపట్నం: మండల కేంద్రంలో మే 21వ తేదీ నుండి 30 మే 2023 వరకు నిర్వహించనున్న శ్రీ నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలలో పాల్గొనేందుకు లక్షలాది మంది సందర్శకుల హాజరుకానున్నందున ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఈ ఉత్సవాలను విజయవంతంగా ముగించేందుకు గాను ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుచేయాలని పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి ఆర్అండ్బీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన 10 లక్షల రూపాయలతో బూరగాం గ్రామం నుండి పర్లాకిమిడి వరకు ప్రయాణించే దిశగా సుమారు 2.2 కి.మీ పొడవుగల బైపాస్ రోడ్డు నిర్మాణం కొరకు పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి బూరగాం గ్రామ ఆవరణలో భూమి పూజను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఈఈఆర్ శివప్రసాద్, ఏఈ తమ్మినేని ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కనకాల నవీన్, కృష్ణారావు, నీలమణి దుర్గ ఆలయ కమిటీ చైర్మన్ నూలు. ఈశ్వరరావు, నీలమణి దుర్గ ఉత్సవ ప్రధాన కమిటీ సభ్యులు, లింగాల మధుబాబు, పాతపట్నం మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎస్.జోగారావు, వైస్ సర్పంచ్ ఏస్ మమతరాణి, ఈవో కూర్మరావు, సర్పంచ్‌లు బిజిలి పాల్గై, నల్లి జగదీశ్వరరావు, ఎంపీటీసీ ప్రతినిధులు మురళి

అప్పో, అమర రమణ, ఏఎంసి వైస్ చైర్మన్ ఎం తాతయ్య, దేవాంగుల సంఘం నాయకులు మంచు చంద్రయ్య, పిఏసిఎస్అధ్యక్షులు శ్యామ్ సుందర్ సర్పంచ్‌ల ప్రతినిధులు ప్రహ్లాద పాలై, పనుకు మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, యస్ కృష్ణారావు, టి.సుధాకర్ గిరిజన సంఘ నాయకుడు జి అప్పన్న, ఎస్ ప్రభాకర్ బూరగాం సచివాలయ సిబ్బంది, వైఎస్ఆర్సీపీ నాయకులు, బూరగాం గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొన్నారు.

'నరసన్న చెరువు' కప్పేస్తున్నారు

- పట్టించుకోని 'రెవెన్యూ' యంత్రాంగం
- సహకరిస్తున్న టిడిపి, వైసిపి ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-నరసన్నపేట: అవును...నరసన్న చెరువు కప్పేస్తున్నారు. పట్టణానికి నడిబొడ్డున వున్న నరసన్న చెరువులో మట్టి వేసి, వాహనాలకు పార్కింగ్ స్థలం పేరుతో కప్పేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హాయాంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పేరుతో చెరువు కప్పటానికి పనులు ప్రారంభం కాగా, నేటి వైసిపి ప్రభుత్వ హాయాంలో భారీ వాహనాలకు చెరువును కప్పేందుకు పనులు మరింత ముమ్మరం చేశారు. అయితే ఈ పనులకు ఆపాల్సిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరించటం విమర్శలకు తావిస్తోంది. పేదవాడు చెరువులో పొలం కట్టుకుంటే రెక్కలు కట్టుకొని వాలిపోయే రెవెన్యూ అధికారులు, ఈ నరసన్న చెరువు విషయంలో తలదూర్చకపోవటం ఆశ్చర్యకరంగా వుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం గొట్టిపల్లి రెవెన్యూలో సర్వే నెం-94/3లో సుమారు 14.8ఎకరాల విస్తీర్ణంలో వున్న నరసన్న చెరువులో కొంత భాగం ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం జరుగగా, మిగతా భాగంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అలాగే చెరువు ప్రక్కనున్న పహారీ కాలనీలో కొంతమంది రాజకీయంగా పలుకుబడి వున్నవారు చెరువును ఆక్రమించి, ఇళ్ళు, ప్రహరీ గోడలు నిర్మాణం చేసుకోగా, చెరువు మధ్యలో మట్టితో కొంతమంది ఆక్రమణదారులు వారధి నిర్మించారు. మిగతా భాగంలో భారీ వాహనాలకు పార్కింగ్ స్థలం కోసం మట్టివేస్తూ చెరువును కప్పేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పనులన్నీ స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నలలో జరుగుతుండటంతో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవటం లేదన్నది ప్రజలకు తెలిసిందే. గతంలో నిండు కుండలా దర్శనమిచ్చే నరసన్న చెరువు, రాజుల చెరువులు నేడు బీడుగా మారటంతో పట్టణ ప్రజలు దాహార్తి తీసుకునేందుకు బోరుబావులపైన ఆధారపడాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని, నరసన్న చెరువులో ఆక్రమణలు తొలగించి, పార్కును ఏర్పాటు చేసి, జలకళతో చెరువు దర్శనమిచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాలక ప్రభుత్వాలను సాగనంపితేనే ప్రజా శ్రేయస్సు

సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రజా సమస్యలపట్ల ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి నియంత పాలనను సాగిస్తున్న ప్రస్తుత ప్రభుత్వాలను సాగనంపితేనే ప్రజా శ్రేయస్సు సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సీపీఐ చేపడుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దపాడులోని పొందర వీధి తదితర వీదుల్లో సీపీఐ శ్రేణులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మురుగు కాలువలు, రోడ్డులు అధ్వానంగా ఉన్నాయని, అలాగే మంచినీటి కొరత చాలా ఇబ్బందిగా ఉందని సీపీఐ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు మరచి స్వంత ప్రయోజనాలు, రాజకీయ లబ్ధి కోసమే ప్రస్తుత ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ

అధికారంలోకి వచ్చాక నల్ల ధనాన్ని వెలికితీసి ప్రజలకు అందిస్తామని చెప్పి అధికారం వచ్చాక కార్పొరేట్ శక్తుల అప్పులను మాఫీచేసి ఆ భారం దేశ ప్రజల మీద వేశారని, ప్రభుత్వ రంగ సంస్థలు కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రంగాలు అదానీ లాంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లోనే ఉండేలా చట్టాలను సవరణ చేస్తూ పేదలను దోచి కార్పొరేట్ లకు దేశ సంపద కట్టబెడుతూ దేశంలో సామాన్యులు బతకలేని పరిస్థితి తీసుకువచ్చిన పాపం మోడీదే అన్నారు. నిత్యావసరాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని దేశాన్ని ధరాఘాత భారతం చేసిన పాపం బీజేపీదే అన్నారు. మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే దేశాన్ని కాషాయ మయం చేసి కార్పొరేట్‌లకు అమ్మేస్తుందన్నారు. మోడీని గద్దె దించే వరకూ సీపీఐ పోరు ఆగదని బీజేపీ పాలన సాగనంపి తేనే దేశ భవిష్యత్తు అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తప్ప మారెలాంటి అభివృద్ధి కనపడటం లేదని, రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల్లో మరీ దారుణంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల మీద పోరాడేందుకు కూడా అవకాశం లేకుండా చీకటి జీఓను తీసుకువచ్చి ప్రజల హక్కులను కలరాస్తున్నారన్నారు. పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల మీద సీపీఐ చేస్తున్న పోరాటాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేలా పోరాటాలు చేసి మన హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ శాఖా కార్యదర్శి రెళ్ల అప్పలసూరి, పట్ట ప్రసాద్, పార్టీ మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

- ధనలక్ష్మి కుటుంబానికి పరిహారం చెల్లించాలి
- సర్పంచ్ సదస్సులో రాజేంద్రప్రసాద్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: సర్పంచ్ హక్కులు, విధులు, నిధులను కాలు రాస్తే సహించేది లేదని పంచాయతీ ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. నగరంలోని ఓ హెూటల్లో సర్పంచ్ సంఘ జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో సదస్సును గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధులుగా హాజరైన రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీముత్యాల రావులు మాట్లాడుతూ సర్పంచ్లకు సమాంతరంగా, పోటీగా పెట్టిన గృహ సారధులు, కన్వీనర్లను తక్షణమే తొలగించాలన్నారు. రాజకీయ పార్టీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2022 -23 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రంలోని 12, 918 గ్రామ పంచాయ తీలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ. 2020 కోట్లను ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్ ధనలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి నష్టపరిహారంగా చెల్లించాలన్నారు. సచివాలయాలను, వాలంటీర్లను సర్పంచ్ల పరిధిలోకి తీసుకు రాకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ముఖ్యమంత్రికి తగిన బుద్ధి చెబుతామన్నారు. సర్పంచ్లంతా సంఘటితంగా ఉద్యమించి హక్కులను సాధించుకుంటామని తేల్చి చెప్పారు. ఈకార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ నాయుడు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు భానోజీ నాయుడు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్క ధనుంజయ యాదవ్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యదర్శి వానపల్లి ముత్యాల రావు, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, ఏపీ సర్పంచుల సంఘం కార్యదర్శి బోగాది అప్పలనాయుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ ల సంఘం అధికార ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం రాష్ట్ర నాయకులు బస్వ గోవిందరెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాల్గవ రోజు ఉచిత వేసవి శిక్షణ

విశాలాంధ్ర-రణస్థలం: శాఖ గ్రంథాలయం రణస్థలంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా నాలుగవ రోజు గురువారం దినపత్రికలు చదవడం, కథలు చదివించడం రాయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి బి జి ఎస్ శంకర్‌రావు ఇన్‌చార్జ్ కార్యదర్శి జిల్లా గ్రంధాల సంస్థ శ్రీకాకుళం శాఖా గ్రంధాలయం రణస్థలంను ఆకస్మిక తనిఖీ చేశారు. శిక్షణా తరగతులలో భాగంగా కె. భాస్కర్ రావు ఆంగ్ల ఉపాధ్యాయులు (పార్ట్స్ ఆఫ్ స్పీచ్ అండ్ స్టోరీ టెల్లింగ్ గురించి వివరించారు). విశ్రాంతి ఉద్యోగి ఆర్ ధర్మారావు, నీతి కథలు (అత్యాశకు పోకూడదు), మహాభారతంలో కావ్యాలు, ఉపాధ్యాయుల వృత్తుల గురించి వివరించారు. అలాగే విద్యార్థిని విద్యార్థులకు కే శ్రీనివాన రావు, జూనియర్ కాలేజ్ ఇంగ్లీష్ అధ్యాపకులు జనరల్ నాలెడ్జ్‌తో పాటుగా మిమిక్రీ చేసి విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో కూడిన విద్యను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులతో సాగు కాలువల అభివృద్ధి

విశాలాంధ్ర-కవిటి : రైతులకు మేలు చేసే విధంగా ఉపాధి పనులను అనుసంధానం చేస్తున్నామని ఎంపీపీ దేవదాసు రెడ్డి అన్నారు. మహేంద్ర తనయ నది లోని పైడిగాం ఛానల్ ద్వారా సాగునీరు అందుతున్న మండలంలోని శాసనం, గోకర్ణ పురం, జలంతర కోట, బూరగం పంచాయతీల కాలువల అభివృద్ధి పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజులు ఎంతో కృషి చేశారన్నారు. ఉపాధి కూలీలు వేసవి కాలంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలని సూచించారు. అధికారులతో కలిసి కాలువల పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల జగనన్నతోనే సాధ్యం

జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి : పేదోడి సొంతింటి కల జగనన్నతోనే సాధ్యపడుతుందని జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రమైన కవిటి జగనన్న కాలనీలో మొగిలిపురి చంద్రకళ, పూర్ణచంద్రరావు దంపతులు నిర్మించుకున్న జగనన్న కాలనీ ఇంటిని జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు,ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం,మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, పిన్నింటి జయరాం,జల్లు నరేష్,గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యాపారానికి నమ్మకం ముఖ్యం : తమ్మినేని

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రజా బహుళయంలో నిరంతరం సేవా భావంతో మెలిగిన నాడు నలుగురికి నమ్మకం కలుగుతుందని ఆ నమ్మకం నలుగురితో కలిసి వ్యాపార అభివృద్ధికి తోడ్పడాలని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం ఆమదాలవలస మండలంలోని కొర్లకోట రోడ్డు వద్ద ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాల్ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎదుగుదలకు నాణ్యతాపరమైన నమ్మకంతో పదిమందితో కలిసి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. అలాగే ఎదుట వారిని కలుపుకుపోయే మనస్తత్వంతో వ్యాపార అభివృద్ధికి దోహద పడుతుంది అని అన్నారు. ఫంక్షన్ హాలు దినదినాభి వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి ఎస్ .డిల్లేశ్వరరావు, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, నిర్వాహకులు పి చిరంజీవిరావు, పి శ్రీనివాసరావు లతోపాటు రమణ, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

జీడి రైతులకు మద్దతు ధర ప్రకటించాలి

మాజీ ఎమ్మెల్యే శివాజీ డిమాండ్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : అలుగాలం కష్టపడి జీడి రైతులు పండిస్తున్న జీడి పిక్కకు మద్దతు ధర కల్పించాలని, 80కేజీ పిక్కల బస్తాను 15వేల రూపాయలగా ప్రభుత్వం ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ అన్నారు. గురువారం జీడి మద్దతు ధర కోసం మండలం పూండి గోవిందపురంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తదుపరి దీక్ష జీడి రైతుల కోసమేనని, గతంలో టీడీపీ పాలనలో పిక్కల బస్తా 14వేల రూపాయలు ఉండేదని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బస్తా 8వేల రూపాయలకు కొనుగోలు చేశారని, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బస్తాకు వెయ్యిరూపాయలు ప్రభుత్వం ఇస్తుందని జీడి రైతులకు మాయ మాటలు చెప్పి నేటికి నీటి మీద రాతలాగా మిగిలాయని అన్నారు. జీడిపిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, జీడిపంటకు బీమా ప్రకటించాలని, రాయితీపై జీడి రైతులకు క్రిమి సంహారక మందులు అందజేయాలని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని హెచ్చరించారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, వజ్జ బాబూరావు, విఠల్, లొడగల కామేష్‌యాదవ్, బద్ద నాగరాజు, వసంతస్వామి, కర్ని రమణ, శశిభూషణరావు, గోవింద పాపారావు, ఎం.దుర్యోధనరెడ్డి, ఎస్.చిట్టిబాబు, సి.యోగేష్, బాలాజీ, అఖిల్, అప్పారావు, బాలక్రిష్ణ, దానయ్య,దాసరి తాతారావు, బావన దుర్యోధన, ముడిమించి నవీన్‌యాదవ్, ఎ.ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

పదిలో శతశాతం పొందిన విద్యార్థులకు అభినందనలు

విశాలాంధ్ర-టెక్కలి : మండలం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు మహంతి అనురాధ మిఠాయిలు పంచిపెట్టి అభినందించారు. పాఠశాలలో మొత్తం విద్యార్థులు 22 మంది కి 21 మంది ప్రథమ స్థానము సాధించగా ఒకరు ద్వితీయ స్థానము సాధించడం జరిగిందని ముగ్గురికి విద్యార్థినిలు 500 పైగా మార్కులు సాధించారని తెలిపారు. పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన మండల తరుణ్ కి 530 మార్కులు వచ్చాయని, 2015లో పాఠశాలకు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 2015-16 లో 100 శాతం,2016-17లో 97 శాతం,2017-18 లో 100 శాతం,2018-19 లో 75 శాతం,2021-22 లో 94 శాతం,2022-23 లో 100 శాతంఉత్తీర్ణ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి.ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు సింహాచలం, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, శ్రీనివాస రావు, పాపారావు, ఇందుమతి నారాయణరావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి మార్గాలు చూపడం ఆదర్శనీయం

జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస : సమాజంలో పదిమందికి ఉపాధి మార్గాలు కల్పించి ఆదర్శంగా నిలవాలని, అప్పుడే సమాజ ప్రగతి సాధించవచ్చని జిల్లా టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. గురువారం కొర్లకోట పర్యటనలో భాగంగా శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగిన మహా యోగమును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి వ్యవస్థ తోనే గ్రామాభివృద్ధి సాధ్యపడు తుందని, గ్రామాలకు రహదారులు సౌకర్యం కల్పిస్తే గ్రామాల నుండి జీవనోపాధికి మార్గాలు దొరుకుతాయని

ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన వరవడితో కూడిన ఉపాధి మార్గాలు కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ అభివృద్ధి కి పాటుపడితే మంచిదని ఇలాంటి ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్ వల్ల పది మందికి ఉపాధి మార్గం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభా ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాల నిర్వహణకు వేదిక ఎంతో అవసరం అన్నారు. అటువంటిది ఈ ప్రాంతంలో ఉండటం పరిసర ప్రాంత ప్రజలకు అందరకు ఉపయోగపడడమే కాకుండా ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఎస్ ఢిల్లీశ్వరరావు ఎంపీటీసీ భాస్కరరావు ఫంక్షన్ హాల్ నిర్వాహకులు పేడాడ చిరంజీవి రావు, శ్రీనివాస రావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

జీడి వ్యాపారులు-కార్మికుల చర్చలు విఫలం

విశాలాంధ్ర-పలాస : పలాస జీడిపప్పు ఉత్పత్తిదారులు, కార్మికుల మధ్య జరిగిన వేతన ఒప్పంద చర్చలు మరోమారు విఫలమయ్యాయి. గురువారం పిసిఎంఎ కార్యాలయంలో సమావేశమైన జీడి వ్యాపారులు, కార్మిక సంఘాలు వేతన సవరణ చేయాలని, నిర్ణయించుకున్న ఏకాభిప్రాయానికి రాకపోవడంతో వాయిదా పడింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతనాలు సవరించుకొని పనుల్లోకి వెళ్లడం అనవాయితీగా వస్తోంది. ఏప్రిల్, మే నెలల్లో నోటీసులు అందుకొని సమావేశాలు నిర్వహించి చర్చలు ద్వారా ఒక అభిప్రాయానికి రావడం జరుగుతోంది. అందులో భాగంగా వ్యాపార సంఘ అధ్యక్షులు మల్లా సురేష్‌కుమార్, కార్యదర్శి శివక్రిష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్ ఆధ్వర్యంలో కార్మిక సంఘ అధ్యక్షులు భీమారావు, కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, గౌరవాధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు బొంపల్లి విశ్వనాథంతో కూడిన సభ్యుల బృందం చర్చలు ప్రారంభించింది. ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా వేతనాలు పెంచక తప్పదని, మార్కెట్‌లో అసాధారణంగా ధరలు పెరిగాయని, దీనివలన కార్మికుల బ్రతుకులు మరింత దాయనీయంగా మారిందని, కార్మిక స్థితిగతులను వివరించారు. ఈ కారణంగా గతంలో కాకుండా కనీసం ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 60శాతం అధికంగా ఇవ్వాలని సూచించారు. జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు మల్లా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ధరలు పెరిగినా సరైన మార్కెట్ లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మరో మూడేళ్లు ధరలు పెంచకుండా యాధాతదంగా వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదనలు పెరిగి మరోసారి దీనిపై చర్చిస్తామని ప్రకటించి చర్చలు వాయిదా వేశారు. అయితే ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు వాయిదాలు జరిగాయని, ఈ సమావేశంలో వేతన ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించడంతో వ్యాపారులు 5శాతం పెంచడానికి అంగీకరించారు. కనీసం 30శాతం వేతనాలు పెంచనిదే తాము తగ్గలేమని కార్మికులు స్పష్టం చేయడంతో మరోమారు వ్యాపార సంఘ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పిసిఎంఎ నేతలు ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాపారులు మల్లా భాస్కరావు, శాసనపురి మురళీ కృష్ణ, బెల్లాల నారాయణరావు, డోకి నాగేశ్వరరావు, సిందిరి సతీష్, కార్మిక సంఘ నాయకులు ఆదినారాయణ, కె.రాములు పాల్గొన్నారు.

కబ్జాదారుల చేతుల్లో కొండ కాలువ భూములు

- తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు
- మోసపోతున్న మధ్య తరగతి ప్రజలు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలోగల కొండ కాలువ భూములు కబ్జాదారుల చేతుల్లోకి పోతున్నాయి. కొంత మంది అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు రెవిన్యూ కార్యాలయంలో అతి గోప్యంగా ఉండే ఎఫ్ఎంబిని సంపాదించి ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలాలపై కన్నేసి స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిని తప్పుడు సర్వే నెంబర్లతో మధ్య తరగతి ప్రజలకు అమ్మకాలు చేసి లక్షలాధి రూపాయిలు రెండు చేతులా సంపాదించుకుంటున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. జంట పట్టణాల్లో ఎవరైనా స్థలాలు కొనుగోలు చేస్తే ఒకటికి రెండు సార్లు వాటికి సంబంధించిన పత్రాలను, స్థలాలను పరిశీలించి కొనుగోలు చేయవలసి ఉండగా అటువంటి దాఖలాలు కానరావటం లేదు. గత కొద్ది రోజులుగా జంట పట్టణాలలో స్థలాల రేట్లు పెరుగుతూ మార్కెట్ ధరలకు కాకుండా అధికంగా అమ్ముడు పోతున్నాయి. మధ్య తరగతి ప్రజల నుండి ధనికుల వరకు ఎక్కడో ఒక దగ్గర స్థలం కొనుక్కొని ఇల్లు నిర్మించుకుంటామని రాత్రనక పగలనక రెక్కలు ముక్కలు చేసుకొని పైసా పైసా కూడ బెట్టి స్థలాలు కొనుక్కున్న వారికి కొన్నాళ్లకు నిరాశే మిగులుతుంది. ఆర్థిక స్థోమత లేక ఇళ్ళు నిర్మించకుండా వదిలేస్తే ఆయా స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. పురపాలక సంఘం పరిధిలో ఉన్న నెమలికొండ, సూదికొండ ప్రాంతాల్లో గల భూములను కొంత మంది భూ బకాసురులు తప్పుడు సర్వే నెంబర్లు సృష్టించి పత్రాలు తయారు చేసుకొని స్థలాలను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా ఖాళీ స్థలం కన్పిస్తే చాలు కబ్జా చేసి

అమ్మేస్తున్నారు. తీరా స్థలాలకు చెందిన పత్రాలు, స్వంత స్థలాలున్న పేద ప్రజలు రోడ్డున పడుతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి సూదికొండ, నెమలికొండ ప్రాంతంలో జరుగుతున్నా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగించాలని జంట పట్టణ వాసులు కోరుతున్నారు.

కాలువ స్థలాలను సర్వే చేయాలి : పలాస కాశీబుగ్గ పరిధి సూదికొండ, కాలువ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆ ప్రాంతంలో రెవిన్యూ అధికారులు పూర్తి స్థాయిలో ఖాళీ స్థలాలను సర్వే చేయించి ప్రభుత్వ స్థలాలకు హద్దులు నిర్ణయించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే కొంత మంది చోటా నాయకులు నకిలీ ఇళ్ళ స్థలాల పట్టాలను తయారు చేసుకొని పునాదులు వేసి ఆక్రమించుకొని కొన్నాళ్ళకు ఇవే స్థలాలను అమ్మకాలు చూపి లక్షలాది రూపాయిలు సంపాధించుకొని జల్సాగా తిరుగుతున్నారు. స్థానిక మథర్‌థెరిస్సా పాఠశాల వెనుక గల కాలువ స్థలాలను కౌన్సిలర్ ప్రతినిధి, మరికొంత మంది కలిసి అమ్మకాలు జరిపేశారు. మిగిలిన కాలువను అమ్మేస్తారని భావించి కొంతమంది జర్నలిస్టులు వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటే వారే కాలువను ఆక్రమించారని మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి చోటా నాయకులు తీసుకువెళ్లి తప్పుడు ప్రచారం చేశారు. ఇప్పుడు అదే కొండ కాలువను కౌన్సిలర్ ప్రతినిధి కబ్జా చేసి అమ్మేశారు. గొల్లు గోవిందరాజులివి.. ముడుపులు వెంకన్నస్వామివి అన్న చందంగా కొంతమంది విలేకరులపై ఆరోపణలు రావడం కోసమెరుపు. ఈ వ్యవహారం పలాస కాశీబుగ్గకు చెందిన విలేకరులకు ఎవరికి సంబంధం లేకపోయినా ప్రచారం మాత్రం జోరుగా సాగింది. అదే ప్రాంతంలో పక్కా భవనాలు నిర్మాణమయ్యాయి. ఈ నిర్మాణాలకు మున్సిపాలిటీ ప్లాన్ అనుమతులు, విద్యుత్ మీటరు అనుమతులు ఎలా వచ్చాయో ఇప్పటికీ స్థానికులకు అర్థం కావడం లేదు. ఉన్నతాధికా రులు స్పందించి కాలువ భూములను సర్వే చేయించి వాటిపై పక్కా భవనాలున్నా తొలగించి కొండ కాలువను కాపాడాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ళ స్థలాల కొనుగోలు దారులు బహుపరాక్: పలాస కాశీబుగ్గ పరిసర ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలను కొనుగోలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలి. అమ్మకందారుడు స్థలం చూపించిన వెంటనే వాటికి సంబందించిన పత్రాలను నిశితంగా పరిశీలన జరిపి వాటిపై స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఈ.సి తీసుకొని పరిశీలించాలి. తాను కొనుగోలు చేసే స్థలం గతంలో ఎవరైనా కొనుగోలు చేశారో లేదో ఆరా తీయాలి. అది జిరాయితీ స్థలమా.. లేకుంటే ప్రభుత్వ స్థలమా గుర్తించి కొనుగోలు చేసుకోవాలి. అమ్మకందారునికి ఆస్థలం ఎలా సంక్రమించిందో దానికి సంబందించిన పత్రాలను కూడా సంబందిత వ్యక్తుల వద్ద ఉన్నాయో లేదో చూసుకోవాలి.ఒక వేళ అన్ని సక్రమంగా ఉండి ఇళ్ళ స్థలం కొనుగోలు చేసిన వెంటనే వాటిపై పునాదులు వేసుకొని తమ అధీనంలో ఉంచుకోవాలి. తరచూ ఇళ్ళు నిర్మించే వరకు ఆ స్థలంను పరిశీలన చేస్తుండాలి. ఈ అంశాలన్నింటినీ పరిశీలన చేసుకొని ఇళ్ళ స్థలాలు కొనుగోలు చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి, ఇరువురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం జాతీయ రహదారిలో గల వాంథ్రాడ గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాధంలో తులసిపేట కాలనీకి చెందిన కిర్రు నాగమణి (32) అక్కడక్కడే మృతి చెందగా, జలుమూరు మండలం పెద్ద దూగం గ్రామానికి చెందిన కె.రాములమ్మ (60) నరసన్నపేట ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నైరా గ్రామానికి చెందిన కె. అశోక్, వెలమపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కె. చిన్నబుచ్చిబాబు తీవ్రగాయాలైయ్యాయి. వివరాల్లోకి వెళ్ళితే మండలంలోగల నిమ్మాడ పంచాయతీ రాజపురం గ్రామంలో జరిగిన ఓ వివాహానికి హజరై ఆటోలో తిరుగు ప్రయాణం చేస్తుండగా వాంథ్రాడ గ్రామ సమీపంలోకి వచ్చే సరికి గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొనడం, ఆటో బోల్తా పడడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాధంలో నాగమణి అక్కడకక్కడే మృతి చెందగా రాములమ్మకు కాలుకు, గుండెకు తీవ్రగాయాలు కాగా, అశోక్ కుమార్ కాలుకు, అటో డ్రైవర్ చిన్నబాబుకు నడుముకి, కన్నువద్ద తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారికి నరసన్నపేట, టెక్కలికి సంబంధించిన 108 సహాయంతో నరసన్నపేట ప్రభుత్వ అసుపత్రికి చికిత్సకోసం తరలించారు. రాములమ్మ చికిత్స పొందుతూ మృతిచెందింది. అలాగే మృతిచెందిన నాగమణికి పోస్టుమార్టంకోసం స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ తెలిపారు. కాగా మృతురాలు నాగమణికి భర్త విడాకులు ఇవ్వటంతో ఇద్దర కుమార్తెలు శారద, రవళిలతో ఒంటరిగా ఉంటూ కూలిపని చేస్తూ పిల్లలకు పెంచుకొని జీవనోపాధి చేసుకుంటుందని, ఈమె మృతితో పిల్లలు అనాథులుగా మిగిలారని తులసిపేట కాలనీ వాసులు, గ్రామస్థులు లబోదిబోమంటున్నారు.

గ్రంథాలయాల్లో చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సంతబొమ్మాళి నౌపడ శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో, ఆయా గ్రంథాలయాల శాఖ అధికారులు కే.కృష్ణారావు, బి.రూపావతి, విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

నాణ్యత లేని కల్వర్టు పనులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : పనులు చేసేటప్పుడు పది కాలాలు ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని కాంక్రీట్ పనులకు పనులకు నిధులు కేటాయిస్తుంది. ఆర్‌సిసి పనులు చేస్తే పదికాలాలు ఉండా లంటారు. ఇది ఒకప్పటి మాట ప్రస్తుతం కాంక్రీట్ పనులు చేస్తే బిల్లుల కోసమే తప్ప ప్రజో పకారానికి కాదు అన్నది స్పష్టంగా కనిపి స్తుంది. ఆమదాలవలస నుంచి శ్రీకాకుళానికి వెళ్లే సి ఎస్ పి రోడ్డుపై జరుగుతున్న విస్తరణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లు చెప్ప వచ్చు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి చేపడు తున్న పనులు అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సిమెంట్ పనుల్లో నాణ్యత కొరవడుతుంది. శ్రీకాకుళం ఆముదాల వలస రెండు నియోజకవర్గాలకు ఉండే జిల్లా ప్రధాన రహదారి నాణ్యతల లేకుండా జరిగితే భవి ష్యత్తులో ప్రయాణికులు, వాహన దారులకు కష్టాలు తప్పవు. మరోవైపు నాణ్యతలేని కల్వర్టు పనులు చేయడం వలన రైతులకు ఇబ్బంది తప్పదని వాపోతున్నారు. పది కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 8 కల్వర్టు పనులు అధికారుల పర్యవేక్షణ లేకుండానే జరుగు తున్నాయి. ఈ పనులను కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేస్తుండడంతో ప్రభుత్వం నిర్దేశించిన ఆశయం నెరవేరదనేది బహిరంగ సత్యం. కాంక్రీట్ పనుల్లో బేస్ నుండి క్రస్ట్ వరకు 40,60, ఎంఎంహెచ్.బి మెటల్ వేస్తున్నారు. కాంక్రీట్ కల్వర్టు పనులు చేస్తున్నప్పుడు సంబంధిత ఆర్ అండ్ బి శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ తప్పనిసరి. ఈ పనులు వద్ద ఒక్క ఇంజనీరింగ్ అధికారి లేకపోవడంతో కూలీల సాంకేతిక నిపుణులు అవతారం ఎత్తు తున్నారు. ఇక్కడ కూలీల ఇంజనీర్లుగా మారి పనులు జరుపు తున్నారు. రోడ్డు పనుల ప్రక్రియ మొదటిగా జరిగే కల్వర్టుల్లోని నాణ్యతలు లేవు. ఇక పూర్తిస్థాయి రోడ్డు ఏ దుస్థితిలో ఉంటుందో అధికారులకే తెలియాలి. పర్యవేక్షణ లేకుండా పనులు జరిగితే ఆ నిర్మాణాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకో వచ్చు. నాణ్యతలేని కల్వర్టు పనుల వల్ల భవిష్యత్తులో సాగునీరుకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందు తున్నారు. ఈ విషయమై డి ఈ ఈ జాన్ విక్లిప్‌ను వివరణ కోరేందుకు కార్యాలయంలో లేకపోవడం తో ఫోన్ చేయగా స్పందించలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జరుగుతున్న పనులలో క్వాలిటీ పరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాటిస్తున్నా.... మీ సమస్య పరిష్కరిస్తా....

గడపగడపకు మన ప్రభుత్వంలో దువ్వాడ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సంకేతిక లోపం వల్ల అందని సంక్షేమ పథకాలు త్వరలో మీకు అందిస్తానని మాటిస్తున్నానని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం మండలం చీపుర్ల పాడు పంచాయతీ ఊడికలపాడు, దుర్గంపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో పాల్గొని గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకొని, సమస్యలుంటే అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారానికి కృషిచేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గత మూడేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన అన్ని ఊర్లుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తిరుగుతుంటే విశేష స్పందన లబించిందన్నారు. ముఖ్యమంత్రి కులమత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుతున్నా మన్నారు. అలాగే దుర్గంపేటలో పని చేయని మంచినీటి బోరును పరిశీలించి అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేసి గ్రామస్థులకు తాగునీరు అందించాలని సూచించారు. అంతకు ముందు చీపుర్లపాడు సచివాలయ సిబ్బంది దువ్వాడ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జీ గద్దవలస నాగభూషణరావు, స్థానిక సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్య రాజు, వైఎస్ ఎంపీపీ దుక్క రోజారామక్రిష్ణ, మండల యూత్ అధ్యక్షుడు తర్ర కామినాయుడు, మండల గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడు బమ్మిడి శ్రీనివాస్, బలగ సూర్యరావు, సనపల లక్ష్మణరావు, సుంకరి జనార్ధన్, అక్కురాడ సురేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారదులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని దూగాన పుట్టుగ గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోంపేట ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 5 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి పదిమందికి కళ్లద్దాలు, 15 మందికి ఉచితంగా మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దూగాన భద్రాచలం, వైద్య సహాయకులు ఆర్ శివ,ఏ ఎన్ ఎం,ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థి మిట్టు మహాపాత్రోకు ఎమ్మెల్యే అభినందన

విశాలాంధ్ర-పాతపట్నం : 2023 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదవ తరగతి ఫలితాలలో 600 గాను 594 మార్కులు రాష్ట్ర స్థాయిలో ఐదవ, శ్రీకాకుళం జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మిట్టు మహా పాత్రోను, శాసన సభ్యురాలు రెడ్డి శాంతి విద్యార్థి నివాస గృహంనకు వెళ్ళి విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించి ఉత్తమ ప్రతిభ కనబరచినందున అభినందనలు తెలియజేస్తూ ఉన్నత చదువులకు రూ.10వేలు చెక్కు ను అందచేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్, పాతపట్నం వైస్ సర్పంచ్ ఎస్ మమతా ఈఓపిఆర్డి నరసింహ ప్రసాద్ పండా, ఎంఈఓ సిహెచ్ మణికుమార్,, జగనన్న సచివాలయాల కన్వీనర్ వై. సూర్యం, శ్రీ నీలమణి దుర్గ ఆలయ కమిటీ చైర్మన్ ఎన్ ఈశ్వరరావు, ఎస్ షణ్ముఖ రావు, టి సుధాకరరావు, భీమ్సేన్ పండా మాస్టారు, ఎస్ పి మిశ్రో, పారసెల్లి రామరాజు,ఎస్ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై మండలస్థాయి చార్జ్ షీట్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు గారు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో వైసిపి ప్రభుత్వం అరాచక, అవినీతి, అక్రమాలపై చార్ట్ షీట్ దాఖలు చేసే పక్రియలో భాగంగా, ప్రజా ఛార్జ్ షీట్ కార్యక్రమం సంతబొమ్మాలి మండలంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వర గారు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి అసెంబ్లీ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను తుంగలో తొక్కి, ప్రభుత్వం ప్రారంభించన నాటి నుండి, దందాలు, భూకబ్జాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ప్రజా ఛార్జ్ షీట్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం మండలంలో ఉన్న పలు గ్రామాల ప్రజల నుంచి ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, సంతబొమ్మాలి మండల నాయకులు చామల్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని రాజపురం ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 75 రూపాయలు, ఓసీసీ, బీసీలకు 150 రూపాయలు ఆన్లైన్‌లో రుసుము చెల్లించి ఈనెల 7వ తేదీ నుండి 25వ తేదీలోగా ఆన్లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:// ఏపీఎంఎస్.ఏపీ జీవోవీ.ఇన్/ఏపీఎంఎస్) వెబ్సైట్ ద్వారా దరఖా స్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చేనెల 11వ తేదీన 10 గంటలనుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించ బడునని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల సమస్యలు తీర్చేందుకే గడపగడపకు మన ప్రభుత్వం : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రజల సమస్యలు తీర్చేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందుతున్నాయా లేదన్నది తెలుసుకున్నారు. గురువారం వడ్డీతాంద్ర పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని, ఒక బృహత్తరమైన కార్యక్రమం రూపొందించాలని, ఈ మేరకు ఈ కార్యక్రమం టెక్కలి నియోజకవర్గంలో గత కొద్ది నెలల నుంచి సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం స్థానిక సర్పంచ్ ఎంపీటీసీ, మండలం వైకాపా పార్టీ కన్వీనర్ లు కోత ఇందిరా, కోత సతీష్ కుమార్ ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మెరుగు అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కిల్లి జగన్ నాయకులు (గోవిందరావు), మండలం సచివాలయాల కన్వీనర్ మోడీ భాస్కర్ రెడ్డి, ఏ ఎం సి చైర్మన్ ప్రతినిధి మేనకేతనరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐతమ్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర

విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు న్యూఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ సూచన మేరకు 'ఏకాభారత్ శ్రేష్ట భారత్ తో పాటు నూతన విద్యావిధానం 2020 లో భాగంగా విజ్ఞాన యాత్రలకు గురువారం బయలుదేరారు. ఐతమ్ కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావులు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఒడిస్సా రాష్ట్రంలోని ప్రసిద్ధ, చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కేంద్రాలైన భువనేశ్వర్, కోణార్క్ పూరి ఇతర సాంస్కృతిక, సాంప్రదాయ నిర్మాణాలను సందర్శించడం వల్ల భిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, భాష వంటి అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, హెచ్ ఓడిలు, నోడల్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబు, అధ్యాపకులు, విద్యర్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : ద్విచక్రవాహనంపై నుండి ఓ వ్యక్తి ఇటీవల బోల్తాపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాల్లోకి వెళితే మెళియాపుట్టి మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన పొలాకి ఈశ్వరరావు(25), కొర్ల శేఖరుతో పాటు కలిసి జాడుపల్లి గ్రామానికి వివాహానికి వెళ్ళి తిరుగు పయనమవుతున్న తరుణంలో జోడూరు వద్ద వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకు పోయింది. ఈ నేపథ్యంలో శేఖరుకు స్వల్ప గాయాలవ్వగా, ఈశ్వరరావు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు శ్రీకాకుళంలో ఆసుపత్రికి తరలించగా అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం మరొక ఆసుపత్రికి తరలించగా చికిత్స జరుగుతుండగా గురువారం మృతి చెందినట్టు సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ తెలియజేశారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. దీని పై స్థానిక ఎస్సై టి.రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఆదివారం మోడల్ లాసెట్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఈనెల 14న ఆదివారం ఉదయం 10.30 గంటలకు మోడల్ లా సెట్‌ను నిర్వహించనున్నట్లు ఏపీబీసీ అడ్వకేట్ అసోసియేషన్, అధ్యక్షులు ఆగురు ఉమామహేశ్వర రావు, చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావులు ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5 సంవత్సరాల అభ్యర్థులకు ఈ మోడల్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ పరీక్ష నగరంలోని కొన్నావీదీలోని ఎంపీఆర్ లా కాలేజీ లొ ఉదయం 10-30 గంటలకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందు హాజరు కావాలని తెలిపారు. ఈ పరీక్షకు అభ్యర్థులు ఎటువంటి ఫీజ్ చెల్లించనవసరం లేదని అన్నారు. అభ్యర్థులు పెన్, ప్లాంక్ తో హాజరు కావాలని కోరారు. పరీక్షకి హాజరు కాగోరు అభ్యర్థులు ఏపీబీసీ అడ్వకేట్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్. లక్ష్మణరావు నెంబర్ల 9640780728 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

మే 20 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి

భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20 నాటికి స్టోన్ ప్లానిటేషన్ పనులు పూర్తి చేయాలని భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్ జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా సిసిఎల్ఏ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన భూహక్కు పత్రాలు సిద్ధం చేయాలని. సర్వే పూర్తి అయిన భూములకు సంబంధించిన మ్యాప్ లను ప్రచురణ కొరకు సర్వే శాఖకు పంపించాలని సూచించారు. భూ హక్కు పత్రాలను భూ యజమానులకు పంపిణీ చేసి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. వీటితోపాటు గ్రామాల్లో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలని సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అన్నంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ పనుల పై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ సర్వే భూ రికార్డులు సహాయ సంచాలకులు కె ప్రభాకర్ రావు జిల్లా రెవెన్యూ అధికారి ఎం రాజేశ్వరి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్‌సెల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ పోలీస్ గ్రీవెన్ సెల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా కస్తూరిపాడు గ్రామానికి చెందిన బమ్మిడి శ్రీనివాసరావును రాష్ట్ర చైర్మన్ రాజేష్ సిల్వ నియమించారు. ఈ పదవిని తనపై బాధ్యతతో అప్పజెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడన మురళికి శ్రీనివాస్ దాన్యవాధాలు తెలియజేశారు. పార్టీ కోసం కట్టపడి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ గ్రీవెన్ సెల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్‌ను నియమించటం పట్ల కోటబొమ్మాళి మండల జేసీఎస్ కన్వీనర్ గద్దవలస నాగభూషణ రావు, అక్కయ్యవలస సర్పంచ్ సుంకరి జనార్ధన రావు, లఖందిడ్డి సర్పంచ్ బమ్మిడి గణపతి, వైకాపా నాయకులు అక్కురాడ సురేష్, సింగూరు నారాయణరావు, కస్తూరిపాడు సర్పంచ్ గురివెళ్ళి గోవింద్, దుప్పల శ్రీనులు ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ అర్గనైజేషన్‌కి ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేశారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు గురువారం ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈవిషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పైడి వెంకటరావు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తప్పిపోయిన 23 మంది విద్యార్థులకు డిఈవో, తిరుమల చైతన్య ఆదేశాలమేరకు ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, టి.కేశవరావు, డి.లక్ష్మణరావు, బి.రాజేంద్ర నాయుడు, వి.సుధాకర్ పట్నాయిక్, ఎస్.హరికృష్ణ, సాయిశ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రం కంచిలిలోని సచివాలయం 1, 2 పరిధిలో నిర్వహించబోయే గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ పరిధిలోని ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్ రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-నరసన్నపేట : ఏపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం పాఠశాల ప్రిన్సిపాల్, పైడి ప్రవీణ అభినందించారు. ఈసంధర్భంగా ఆమె మాట్లా డుతూ ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 550 మార్కులు పైబడి 13మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, వారందరికీ అభినందన సభ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, డి.రామకృష్ణ, నవీన్ పాణిగ్రాహి, బి.అప్పారావు, పిఈటి, నీలం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్రినాధస్వామి మహోత్సవాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం కురుడు పంచాయతీ చౌదరికొత్తూరు గ్రామంలో ఆదివారం నుంచి గురువారం జరిగిన శ్రీ త్రినాధస్వామి మహెూత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈఉత్సవాల్లో త్రినాధస్వామికి మొక్కుకొని అక్కడి మర్రి చెట్టుకు అరెటిగెల కట్టి కోరిక కోరితే ఆ కోరిక తీరుతుందని భక్తుల నమ్మకం దీంతో ఆగ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేసి అరెటి గెలలుకట్టి పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామపెద్దలు రొక్కం సూర్యప్రకాష్, ప్రజలు, యూత్ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

దంత వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్థానిక శ్రీ సాయి డెంటల్ కళాశాల స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 45 మంది దాతలు రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ టీవీ గంగ రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తలసిమియా వ్యాధితో బాధపడుతూ ఉన్న చిన్నారులకు రక్తమందించి సహాయపడాలని సంకల్పంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని, కాబోతున్న డాక్టర్ కమ్ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంపై అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్ మోహన్ రావు కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థులని అభినందించి రక్తం కొరత ఉన్న సమయంలో రక్తదానం ఏర్పాటు చేయటం హర్షించ దగ్గ విషయం అని కొనియాడారు. డెంటల్ కళాశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన పేద, మధ్యతరగతి ప్రజలకు దంత సంరక్షణపై చైతన్యం కలిగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధీర్, డాక్టర్ ఎల్. శ్రీకాంత్, డాక్టర్. కె.నందితారాణి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కే.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ప్రకాష్, పవన్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పండగొచ్చింది' నాటిక

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం చిన్నకొత్తూరులో గ్రామదేవత ఉత్సవాలు సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక కళాకారులు ప్రదర్శించిన "పండగొచ్చింది" నాటిక ఆకట్టుకుంది. భర్తను భార్య ఏవండి అని గౌరవించకోవాలని లేకుంటే విడాకులు స్థాయికి వచ్చిన సంఘటనలు, మామ గారు పండగలు, సంక్రాంతి వంటి రోజుల్లో కూడా అల్లుడు, కుమార్తెలను ఆహ్వానించకపోగా ఏళ్ల తరబడి అత్తగారింటికి రాకపోకలు నిర్వహించుకోవడం, కొత్త అల్లుడు, కుమార్తెల ఆలోచించి ఇటువంటి పద్ధతులు మార్చుకోవాలని చేసిన నిర్ణయాలు ఆకట్టుకున్నాయి. మునసబు నలుగురు కుమార్తెలు పెళ్లిళ్ల చేసిన తరువాత ఆ కుటుంబంలో ఎలా చిందర వందరగా జరిగి కాశీకి వెళ్లిపోవాలని తీసుకున్న నిర్ణయాలని ఆకట్టుకున్నాయి. ఆది విష్ణు రచించిన నాటికను ఎం.నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. కృష్ణమూర్తి పాత్రలో చిప్పల సుమన్, మునసబు పాత్రలో ఎ.కాంతారావు, ధనుంజయ పాత్రలో ఎ.మోహనరావు, రాధ పాత్రలో రాజేశ్వరి (విజయనగరం), సత్యం పాత్రలో వంక గణేష్, ఎంకడు పాత్రలో ఎం.జోగేష్ పోషించారు. శ్రీ నూకాలమ్మ అమ్మదేవత సందర్భంగా నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు.

రాజీ మార్గమే రాచమార్గం : జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి

వివాలాంధ్ర-కోటబొమ్మాళి : రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్, మండల న్యాయ సేవా సంఘం ఇంచార్జి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి అన్నారు. అమె గురువారం స్థానిక కోర్టులో ఫీ లోక్ ఆదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల13న కోటబొమ్మాళి కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తామని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, భార్య భర్తల కేసులు, చిట్ ఫండ్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని, అందువల్ల న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాధుల సంఘం అధ్యక్షుడు డి. నరసింహామూర్తి, కార్యదర్శి అప్పలనాయుడు, ఏపీపీ ప్రియదర్శిని, న్యాయవాధులు కె.మన్మదరావు, బి.ధర్మారావు, ఎల్. శ్రీనివాసులు, పూజారి వాసుదేవరావు, పల్లి రామారావు, కె. వెంకటరావు, స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

విశాలాంధ్ర-కవిటి : ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షలలో మండలంలోని జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విశ్రాంత డిఎస్పి ఎస్ వి వి ప్రసాద్ రావు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు నొలియా భవాణీ (551) పొల్లాయి దీపికా సుప్రియ (514)గుర్రాల చంద్రశేఖర్ (500) లకు నోలియ భవానికి 5 వేల రూపాయలు, పొల్లాయి దీపిక సుప్రియ,గుర్రాల చంద్రశేఖర్ లకు చెరో 2,500 వేల రూపాయలు మొత్తం పదివేల రూపాయలు విశ్రాంత డిఎస్పి ఎస్ వి వి ప్రసాదరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేసి జ్ఞాపికలతో విద్యార్థులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్ రావు, ప్రధానోపాధ్యాయులు అర్జునుడు, ఉపాధ్యాయ సిబ్బంది జయరాం, డి.వి.రమణ మూర్తి,గ్రామస్తులు పూడి వెంకటేశ్వర రావు, బావన నూకరాజు, బార్ల రాజేష్, పూడి లోకనాథం, పొల్లాయి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం దిశగా వైజాగ్ యువకుల విశాఖ... నేపాల్ సైకిల్ యాత్ర

- ఘన స్వాగతం పలికిన శ్రీకాకుళం జేసీఐ సన్ రైజర్స్

విశాలాంధ్ర -అరసవల్లి: ఆడపిల్లలను రక్షించాలి, వారి ఉన్నత చదువులకు ఊతం ఇవ్వాలని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే లక్ష్యంతో విశాఖ నుండి నేపాల్ వరకూ వైజాగ్ కు చెందిన ముగ్గురు యువకులు సైకిల్ యాత్ర ప్రారంభించారు. యాత్ర ద్వారా తాము ఎంచుకున్న లక్ష్యాలను నినాదాలు చేసుకుని దారిలో ఎదురైన వారందరికీ అవగాహన కల్పిస్తూ విశాఖకు చెందిన ఆ ముగ్గురు యువకులు లివింగ్ స్టోన్, ప్రశాంత్, సంపత్ లు చేపట్టిన సైకిల్ యాత్రకు విశేష స్పందన లభిస్తోంది. కొద్దిరోజుల క్రితం విశాఖలో ప్రారంభమైన ఈ యాత్ర తాజాగా శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జేసీఐ సన్ రైజర్స్ సభ్యులు ముగ్గురు యువకులకు ఘన స్వాగతం పలికారు. శ్రీకాకుళం చేరుకున్నవారిని జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు జేసీ వినోద్ కుమార్, జేసీ దూసి సంతోష్, జేసీఐ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అడ్వైజర్ జేసీ గీత శ్రీకాంత్ విశాఖ యువకులు చేపట్టిన కార్యక్రమంను అభినందించారు. సైకిల్ యాత్ర విజయవంతంగా జరగాలని వారికీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమం లో జేసీ ప్రవీణ్ కుమార్, జేసీ శ్రవణ్ కుమార్, జేసీ వెంకటేష్, జేసీ దామోదర్, జేసీ సాయి దయాల్, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకుని సత్వర న్యాయం పొందండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు, రాష్ట్ర హైకోర్టు వారి సూచనలు, మార్గదర్శికాలు ప్రకారం ఉచిత న్యాయ సలహా కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి, సామాన్య ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జువైడ్ అహ్మద్ మౌలానా చెప్పారు. గురువారం సాయంత్రం నగరంలో పి.ఎస్.ఎన్. స్కూల్ వెనుకగల మున్సిపల్ గ్రౌండ్స్‌లో గల ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో ధనిక,పేద తేడా లేకుండా అందరికీ సమన్యాయం అందించటం జరుగుతుందన్నారు. ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా పోలీస్,రెవెన్యూ,ఇన్సూరెన్స్ విభాగాలు ముందుకు వచ్చి సంపూర్ణ సహకారాన్ని అందించాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ సంఖ్యలో కుటుంబ తగాదాల కేసులు నమోదు అవుతున్నాయని, ఇందులో భార్యాభర్తల మధ్య గతకొద్ది రోజులుగా ఎక్కువ సంఖ్యలో తగాదాలు జరుగుతున్నట్లు కేసులు నమోదు అవుతున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఏమైనా స్వల్ప కాలిక విషయాలపై తగాదాలు వస్తే ఉభయ పెద్దల్లో కూర్చొని వాటిని పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు జి.ఇందిరాప్రసాద్, అన్నెపు సత్యనారాయణ, గేదేల వాసుదేవరావు, కె.ఆఫీస్ నాయుడు,స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, జిల్లా న్యాయస్థానంలో వివిధ కోర్టుల న్యాయమూర్తిలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, ఎగ్జిబిషన్ నిర్వాహకులు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

14న జీ-సరిగమప గ్రాండ్ ఫినాలే

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జీ తెలుగు పాపులర్ నాన్ ఫిక్షన్ షో సరిగమప గ్రాండ్ ఫినాలే మే 14వ తేదీ ఆదివారం జరగనుందని ఆ ఛానల్ ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. ఈ సంగీత ప్రయాణంలో 14వ సీజన్గా ప్రారంభమైన సరిగమప ఛాంపియన్షిప్ తుదిపోరుకు సిద్ధమైందన్నారు. ఈ ఆదివారం, మే 14న ప్రసారం కానున్న సరిగమప ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలేలో విజేతలెవరో తేలిపోనుందనీ, ఛాంపియన్స్ మధ్య జరుగుతున్న ఈ పోరులో టైటిల్ విన్నర్ ఎవరో తెలుసుకోవాలంటే ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానున్న సరిగమప ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్ని జీ తెలుగు ఛానల్లో తప్పకుండా చూడాలని కోరారు. జనవరి నుంచీ ప్రతి వారం తమ ప్రదర్శనలతో అలరిస్తున్న సరిగమప కంటెస్టెంట్స్ ఈ వారం మరిన్ని అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమయ్యారన్నారు. తుదిపోరులో తలపడేందుకు సిద్ధమైన కంటెస్టెంట్స్, మెంటర్స్ ఎంట్రీతో ప్రారంభమయ్యే ఈ వారం ఎపిసోడ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందనీ, ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీతల దర్శకుడు మణిశర్మ హాజరవుతారన్నారు. ఎనర్జిటిక్ యాంకర్ గా ప్రదీప్ వ్యవహరిస్తారని, హీరో అల్లరి నరేష్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.